
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 27 మే 2025





ప్రకృతి సేద్యం దిశగా

జిల్లా వ్యాప్తంగా 700 హెక్టార్లలో సాగు

జిల్లాలో నేషనల్ మిషన్ అన్ నేచురల్ ఫార్మింగ్ పథకంలో 14క్లస్టర్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లస్టర్‌లో 125మంది చొప్పున రైతులను ఎంపిక చేస్తారు. ఇందుకోసం మొదటి విడతలో ఒక క్లస్టర్‌లో 50 హెక్టార్ల చొప్పున 700హెక్టార్లలో సాగు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం రైతులను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులను స్వీకరించనున్నారు. సేంద్రియ పంటల సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుక వచ్చిన కొత్త పథకం ద్వారా జిల్లాలోని 13 మండలాల్లో మొదటగా 14గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా శ్రీకారం చుట్టారు. రైతులు ప్రధానంగా సేంద్రియ వ్యవసాయం వల్ల దిగుబడి తగ్గుతుందని చీడ, పీడల ఎక్కువ సోకుతాయనే కారణంగా ఎక్కువమంది రైతులు ఆసక్తిచూపరు. ఎరువుల వినియోగం, పురుగుల మందు వాడకం లేకపోవడం తో నష్టపోతామనే భావిస్తారు. రైతులు తొలి మూడేళ్లలో దిగుబడి తగ్గినప్పటికీ సాగు వ్యయం కూడా తగ్గి రైతులకు రాబడి పెరుగుతుందనే అవగాహన కల్పించనున్నారు. ఇందుకోసం వ్యవసాయ అధికారులు మట్టి నమూ నాలను కూడా సేకరిస్తున్నారు. సేంద్రియ పంటల సాగు కోసం రైతు లకు ఎకరానికి రూ. 4 వేల ఆర్థిక సహాయం అందిస్తారు. జిల్లాలో సేంద్రియ సాగుపై రైతుల్లోనూ చర్చ మొదలైంది.

- ఎన్ఎంఎన్ఎఫ్ పథకం రూపకల్పన
- జిల్లాలో నేచురల్ ఫార్మింగ్ మిషన్‌కు 14 క్లస్టర్ల ఏర్పాటు
- జిల్లాలో 1,750 మంది రైతుల ఎంపికకు కసరత్తు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆరోగ్యకరమైన పంటలే లక్ష్యంగా, రైతును ప్రకృతి సేద్యం దిశగా ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్‌అన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్) పథకాన్ని తీసుకవచ్చింది. సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా తీసుకవచ్చిన సేంద్రీయ సాగుద్వారా భూసారాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి తోడ్పాటు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన ఈ పథకంలో రైతులను ప్రోత్సహించడానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలో కసరత్తు మొదలైంది. రైతులకు శిక్షణ అందించడానికి వ్యవసాయ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో 2.43 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు

ముందస్తుగానే రుతు పవనాలు వస్తున్నాయనే వాతావరణశాఖ ప్రకటనలతో రైతులు వానాకాలం సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.43 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయనున్నారు. గంభీరావుపేటలో 19,330 ఎకరాలు, ఇల్లంత కుంటలో 38,470 ఎకరాలు, ముస్తాబాద్‌లో 25,250ఎకరాలు, సిరిసిల్లలో5,883 ఎకరాలు, తంగళ్ల పల్లిలో 22,031 ఎకరాలు, వీర్నపల్లిలో 8,792 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 21,130 ఎకరాలు, బోయినపల్లిలో 21,310 ఎకరాలు, చందుర్తిలో 21,610 ఎకరాలు, కోనరావుపేటలో 23,700ఎకరాలు, రుద్రంగిలో 10,105 ఎకరాలు, వేములవాడ 10,578 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 15,614 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో వరి 1.84 లక్షల ఎకరాలు, పత్తి 49,760 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పెసర 79 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, జొన్నలు 14ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాల సాగుకు సిద్ధమయ్యారు. ఇందు కోసం జిల్లాలో రైతుల కోసం 56,568 క్వింటాళ్ల వరి విత్తనాలు, పెసర 4.08 క్వింటాళ్లు, మొక్కజొన్న 27.04 క్వింటాళ్లు పత్తి 1,28,650ప్యాకెట్లు కందులు122.5 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని సిద్ధం చేశారు. వానాకాలం సాగులో ఎరువులు 56,060 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇందులో యూరియా25,370 మెట్రిక్‌టన్నులు, డీఏపీ 3,460 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,390 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4,115మెట్రిక్ టన్నులు ఎస్ఎస్‌పీ 725 మెట్రిక్‌టన్నులు అవసరం అవుతాయని అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నారు.



తూనికలు, కొలతల అధికారుల దాడులు

సిరిసిల్లలో దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న తూనికలు కొలతల అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిరిసిల్ల రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని పలు వ్యాపార దుకాణాల్లో సోమ వారం తూనికల కొలతల అధికారులు దాడులు చేసి అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. సిరిసిల్లలో 'అస్తవ్యస్తంగా లీగల్ మెట్రోలజీ కార్యాలయం-అందు బాటులో ఉండని అధికారులు' అనే శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించిన కరీంనగర్ జోనల్ అధికారి విజయసారథి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పలువ్యాపార దుకాణాల్లో దాడులుచేసి అధికధరకు వస్తువులను విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి రూపేష్‌కు మార్, సిబ్బంది గంగరాములు, శ్రీనివాస్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యాలయం ఎదుట బైఠాయించారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు చేసేందే మీ లేదన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేదా ప్రజలకు క్షమాపణ చెప్పి గద్దె దిగిపోవాలని సొల్ల క్రాంతి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోస పూరిత మాయమాటలతో అధికారంలోకి వచ్చి ఆరు గ్యారేంటీల విషయంలో కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. అర్హులైన లబ్దిదారులతో కలిసి కార్యాలయాన్ని ముట్టిండించమన్నారు. వెంటనే హామీలను నెరవేర్చాలన్నారు. ఈకార్యక్రమంలో బీజేవైఎం , బీజేపీ నాయకులు ఏదునూరి గోపి, జనార్ధన్, మెంగని మహేందర్, చిట్నేని శ్రీనివాస్‌రావు, సత్యం, బాధ నరేశ్, చీకోటి మహేశ్, బత్తుల గణేశ్, శివ, ఊరడి రాజు, మీసశ్రీను, మద్దికుంట రమేశ్, అజయ్, పెంటం సురేశ్, వేణు, రఘు, పద్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్వాగత ర్యాలీని విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న వరంగల్ తలపెట్టిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ స్వాగత ర్యాలీని విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల ఆ సంఘం కార్యకరల సమావేశం సోమవారం జరిగింది. గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమించిన నాయకుడు మందకృష్ణ మాదిగ అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు అనేక పోరాటాలు చేశారని అన్నారు. ఈ నెల 27న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకుంటారని అన్నారు. 31న వరంగల్‌కు చేరుకోకున్న ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు శరవింద్, రాజం, రాజేశ్, నర్సయ్య, లక్ష్మణ్, దేవయ్య, సతీష్, చంద్రయ్య, సురేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరం ముగింపు వేడుక

గంభీరావుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిబిరం ముగింపు వేడుకను నిర్మహించారు. నెల రోజుల పాటు జరిగిన వేసవి శిబిరంలో విద్యార్థిని, విద్యార్థులకు కంప్యూటర్ ఫండమెంటల్స్, మైక్రోసాఫ్ట్ ఆపీస్, ప్రాథమిక కోడింగ్‌పైన ఉచిత తరగతులను నిర్వహించారు. ఈ సమ్మర్ క్యాంపులో దాదాపు 100 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ ముగింపు కార్యక్రమంలో బాలుర పాఠశాల హెచ్ఎం ఎం శ్రీనివాస్, బాలికల పాఠశాల హెచ్ఎం కె పద్మాదేవి హాజరై విద్యార్థులు చేసిన కోడింగ్ ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు రాజుగురు హిరేమత్, దురంగ్ బోసు మల్లిక్ ఎల్ హహేందర్, ఎస్ మహేస్, జి జగన్ పాల్గొన్నారు.

సంప్రదాయ వృత్తులు చేసేవారికి సహకరించాలి

ఇల్లంతకుంట, మే 26(ఆంధ్రజ్యోతి) సాంప్రదాయ వృత్తులు చేసేవారికి బ్యాంక్ అధికారులు సహకరించాలని బీజేపీ మం డల ఉపాధ్యక్షుడు చిమ్మన గొట్టు శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం క్రింద దరఖాస్తు చేసుకున్న వారికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు సహకరించడం లేదన్నారు. బ్యాంకులు నిరాకరిండంవల్ల అర్హులైన వృ త్తిదారులకు అన్యాయం జరుగుతుందన్నా రు. తెలంగాణ గ్రామీణబ్యాంకు మేనేజర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

బాధితులకు న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే

- ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 18ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు.

అర్జిదారులనుండి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కారించాలని ఆదేశించామన్నారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా , ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదు దారునికి పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

కార్మిక వాడల్లో ఏరులై పారుతున్న మద్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని కార్మిక వాడలల్లో మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్ల పట్టణం సుభాష్‌నగర్‌లోని కార్మిక భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రాత్రి అయితే మెడికల్‌షాపుల్లో మందులు దొరుకుతాయే తెలియదు కానీ మద్యం మాత్రం 24 గంటల కార్మిక వాడడల్లో అందుబాటులో దొరుకుతుందన్నారు. కూలీ పనులుచేసుకుంటు జీవిస్తున్న కార్మికులు వచ్చిన డబ్బులను మద్యానికి తగిలేయడం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిరిసిల్ల పట్టణంలో 20 బెల్ట్‌షాపులు ఎక్సైజ్ శాఖ అధికారుల కన్నుసన్నల్లో నడుస్తున్నాయని అన్నారు.బెల్ట్‌షాపు నిర్వహకుల వద్దనుంచి ప్రతి నెలఎక్సైజ్ అధికారులు కమీషన్‌లు తీసుకుంటారని అన్నారు. కార్మిక వార్డులల్లో 24గంటల పాటు బెల్ట్ షాపులు నడుస్తుండడంతో యూవత మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. దీనిపై అధికారులకు పలుమార్లుఫిర్యాదులు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జిల్లా కలెక్టర్ స్పందించి బెల్ట్‌షాపుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సోమనాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

పంట మార్పిడితో అధిక దిగుబడులు

ఎల్లారెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త రమేశ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వానాకాలంలో సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. యూరియా వాడకాన్ని తగ్గించి యాజమాన్య పద్ధతులను పాటించాలని అన్నారు. రైతులు సేంద్రియసాగు వైపు ప్రయ త్నించాలని అన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి లోకేష్, ఏఈవో లతాశ్రీ, రైతులు పాల్గొన్నారు.

చందుర్తిలో మహిళ దారుణ హత్య

- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు



మల్లవ్వ (ఫైల్)

6

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రొటోకాల్ వివాదం

- కేటీఆర్ క్యాంప్ కార్యాలయానికి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు
- అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

సిరిసిల్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిండెంట్ కే తారకరామారావు సిరిసిల్ల నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలని ఫొటోతో కాంగ్రెస్ నాయకులు క్యాంపు కార్యాలయంలోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. వీరిని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వారిని అదుపు చేయడానికి పోలీసులు లాఠీచార్జి చేశారు. దీంతో పలువురికి గాయాలు కావడంతో ఉద్రిక్త పరిస్థితికి దారి తీసింది. సిరిసిల్ల నియోజకవర్గంలో కొద్ది రోజులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఏర్పడిన ప్రొటోకాల్ వివాదం మరింత ముదిరింది. ప్రొటోకాల్ పాటించడం లేదని జిల్లా అధికారులపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో సీఎం ఫొటో పెట్టాలంటూ డిమాండ్ చేస్తూ వస్తున్నారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టే కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ తల్లి విగ్రహాల ఫొటోలతో క్యాంపు కార్యాలయం వద్దకు రావడంతో బీఆర్ఎస్ నాయకులు వీరిని అడ్డుకోవడానికి వచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట మొదలు కావడంతో పోలీసులు వారిని చెదరగొట్టడానికి లాఠీచార్జి చేశారు. ఇందులో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు హరీష్, బొల్లి రామ్మోహన్, మధు, శ్రీను తదితరులకు గాయాలయ్యాయి. కాంగ్రెస్ నాయ కుల తీరు, పోలీసుల లాఠీఛార్జికి నిరసనగా బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కాం గ్రెస్ నాయకులతో పాటు బీఆర్ఎస్ నాయకులను కూడా బలవంతంగా వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. తంగళ్లపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్, మునిగెల రాజు, కోడం అమర్, రాము, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు. తోపులాటలో సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఇరు వర్గాలను సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, యాదగిరిలు అదుపు చేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు.

ఖండించిన బీఆర్ఎస్ నేతలు

- బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జి చేయడం హేయ మైన చర్య అని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు.
- కాంగ్రెస్ పాలకులు దాడులను ప్రోత్సహిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ పాల్పడుతూ ప్రజాస్వామ్య విలువలను పాతరేస్తున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు చేసి తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- సీఎం రేవంత్‌రెడ్డిది రౌడీల పాలన అని, ఎవ్రీడే ఈజ్ నాట్ సండే అని పోలీస్ అధికారులు గుర్తు ఎరిగి ప్రవర్తించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌గుండాల దాడి హేయమైన చర్య అని అన్నారు.



ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు





గాయపడ్డ బీఆర్ఎస్ నాయకులు

రామగుండం సీపీ పేరుతో సోషల్ మీడియాలో నకిలీ అకౌంట్లు

కోల్‌సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులపేర సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్, వాట్సాప్‌ల్లో వారి ఫొటోలను వాడి నకిలీ అకౌంట్లు క్రియేట్ చేశారు. ఈ ప్రాంతంలోని పలువురు ప్రముఖులకు ఫ్రెండ్స్ రిక్వెస్ట్‌లను పంపిస్తున్నారు. దీంతో ఉన్నతాధికారుల అకౌంట్ కదా అని ఆక్సెప్ట్ చేస్తే సదరు అధికారి పేర చాటింగ్ చేస్తు న్నారు. ఫలానా అధికారి బంధువులు, మిత్రులు ఆర్మీలో అధికారులుగా పనిచేస్తు న్నారని, వారు బదిలీకావడం వల్ల తక్కువ ధరకు సామగ్రి అమ్ముతున్నారని, కొనుక్కోవాలని, డబ్బులు పంపాలంటూ సూచిస్తున్నారు. అలాగే పుట్టిన రోజు సందర్భంగా బహుమతులు పంపించే విధంగా చాట్‌చేయడం, పోలీస్ అధికారులే చాట్ చేస్తున్నట్లు నమ్మిస్తున్నారు. దీనిపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా స్పందించారు. ఇలాంటి వాటిపట్ల స్పందించవద్దని, డబ్బులు పంపవద్దని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు రోజురోజుకు పేట్రేగిపోతున్నారని, గతంలో సామాన్యులనే లక్ష్యంగా చేసుకున్న నేరగాళ్లు ఇప్పుడు, ప్రముఖులు, పోలీస్ అధికారుల పేర నకిలీఅకౌంట్లు తెరిచివారే చాట్‌చేస్తున్నట్టు నమ్మిస్తున్నారన్నారు. నానారకాలుగా చాటింగ్ చేస్తున్నారన్నారు. పోలీసులెవరూ ఫ్రెండ్స్ రిక్వెస్ట్‌లు పంపరని, ఆక్సెప్ట్‌లు చేయరని పేర్కొన్నారు.

- మానేరు, హుస్సేన్‌మియావాగు కలిసేచోట ప్రతిపాదన
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు

గుంటిమడుగు ఎత్తిపోతలకు మోక్షమెప్పుడు?

కాల్వశ్రీరాంపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల రైతులు ప్రధానంగా ఎస్సారెస్పీ నీటిపై ఆధారపడతారు. ఈ ప్రాంతానికి ఎస్సారెస్పీ చివరి భూములు కావడంతో సాగునీటి సరఫరా సక్ర మంగా జరగడం లేదు. దీంతో వేసవిలో సాగు నీటి కోసం అన్నదాతలు నానాతంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు మానేరు, హుస్సేన్‌మియావాగు కలిసే చోట పెద్దరాతుపల్లి శివారు గుంటి మడుగు ప్రాంతంలో ప్రాజెక్ట్ నిర్మించాలని బీఆర్ ఎస్ హయాంలో ప్రతిపాదించారు. గంగారం గ్రామపరిధి ఊషన్నపల్లెకు చెందిన ఐడీసీ మాజీ చైర్మన్‌గా ఉన్న ఈద శంకర్‌రెడ్డి అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి రైతుల సమస్యలు తీసుకెళ్లారు. కేసీఆర్ హామీతో 2019లో గుంటిమడుగు ఎత్తిపోతల పథకానికి సర్వే కూడా చేయించారు. అప్పటి కలెక్టర్ అలుగు వర్షిణి ప్రాజెక్టు ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకొని గంటి మడుగు ఎత్తిపోతల పథకం అవసరమని కలెక్టర్ ధ్రువీకరించారు. సుమారు 450కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేశారు. రిజర్వాయర్‌తోపాటు మానేరులో కిష్టం పేట వరకు, హుస్సేన్‌మియావాగు చుట్టూ కాల్వశ్రీరాంపూర్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర కరకట్టలు నిర్మించి సాగునీటిని నిల్వచేసేందుకు ప్రణాళిక రూపొందించారు. దీంతో మానేరు, హుస్సేన్ మియా వాగులో సుమారు నాలుగు కిలో మీటర్ల మేర నీరు నిల్వ ఉండి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని, నిల్వ ఉన్న నీటిని మంథని ప్రాంత రైతాంగానికి కూడా ఇచ్చేందుకు ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. సుమారు 50వేల ఎకరాలకు రెండు కాలాల పంటలకు సాగునీరు అందుతుందని అంచనా వేశారు. ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి సుమారు కోటిరూపాయల నిధులతో వ్యాప్కో కంపనీతో సర్వే కూడా చేయించారు. సుమారు మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించేందుకు అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి అందజేశారు.

ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని హుస్సేన్‌మియావాగు, మానేరు ప్రాంత రైతులు ఆశపడ్డారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. గుంటిమడుగు ఎత్తిపోతల పథకం వలన భూపాలపెల్లి జిల్లా టేకుమట్ల మండలం మానేరు పరివాహక ప్రాంత గ్రామాలతో పాటు, మండలంలోని పెద్దరాత్‌పల్లి, కాల్వ శ్రీరాంపూర్, చిన్నరాత్‌పల్లి, మోట్లపల్లి, కిష్టం పేట, మీర్జంపేటతోపాటు ముత్తారం మండలం లోని పలు గ్రామాల రైతులకు ప్రాజెక్టు ఉపయోగకరంగా ఉంటుంది. వేసవిలో హుస్సేనిమియా వాగులో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు ఎండిపోతుంటాయి. దీంతో సాగునీరు అందక పంటలను పశువుల మేతకు ఉపయోగించిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఎస్సారెస్పీ కాలువలపై ఆధారపడకుండా గుంటిమడుగు వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.


ప్రాజెక్టు నిర్మించే గుంటిమడుగు ప్రాంతం

రెండు పంటలకు సాగునీరు

రైతు రావిసెట్టి సారయ్య(పెద్దరాత్‌పల్లి)



గుంటిమడుగు ఎత్తిపోతల పథకం వలన రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రెండు పంటలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం సాగు నీరు అందక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నాం

రైతు కారుపాకలక్ష్మణ్(కాల్వశ్రీరాంపూర్)



ఎస్సారెస్పీ కాలువ చివరి ప్రాంతంలో భూములు ఉండడం వలన సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నాం. గుంటిమడుగు రిజర్వాయర్‌తో ఈ ప్రాంత భూములు సస్యశ్యామలవుతాయి. వేసవి వచ్చిందంటే సాగునీరు అందక అనేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి ప్రాజెక్టు నిర్మించాలి

భూ కబ్జా బెదిరింపులపై సీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలం సుందరగిరిలో రమేష్ అనేవ్యక్తి తనభూమి కబ్జా చేసేందుకు బెదిరిస్తున్నాడని అదే గ్రామానికి శ్రీమూర్తి రాజు సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశాడు. రమేష్ బెదిరింపులతో తమ కుటుంబం భయాందోళనకు గురవుతున్నదని, అతడితో ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. రమేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరాడు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

రామగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మంథని మండలం సిద్దపల్లి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మట్టికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతోపాటు డ్రైవర్లను విచారించగా కల్వచర్లకు చెందిన టిప్పర్ యజమాని ఆదేశాల మేరకు మంథని మండలం గుంజపడుగులోని సరస్వతి పంప్‌హౌజ్ దగ్గర నుంచి రాఘవపూర్‌లోని ఇటిక బట్టీలకు తరలిస్తున్నామని తెలిపారన్నారు. ఇద్దరు డ్రైవర్‌లను అదుపులోకి తీసుకొని యజమాని, డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూ వివాదంలో మహిళా రైతు దారుణ హత్య

చందుర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు మల్లవ్వ (60) అనేమహిళా రైతు సోమవారం సాయంత్రం హత్యకు గురైంది. మృతురాలి కుటుంబసభ్యులు, గ్రామస్తులు, పోలీసులకథనంప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు మల్లవ్వ, బొల్లు మనోజ్ అనే యువకుడి మధ్య కొన్నిసంవత్సరాలుగా భూ వివాదం నడుస్తోంది. ఈ విషయంలో పలు మార్లు పంచాయతీలు జరిగాయి. మల్లవ్వ తనకు ప్రాణభయం ఉందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదుచేశారు. మల్లవ్వ సోమవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా మనోజ్ కత్తితో మల్లవ్వను హత్యచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటుదూరంలో పెద్దమ్మ ఆలయంవద్ద మల్లవ్వను అత్యంత దారుణంగా హత్యచేశాడు. అనంతరం హంతకుడు మనోజ్ కత్తితో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సమాచారం తెలుసుకున్న చందుర్తి ఎస్‌ఐ అంజయ్య సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త రాజయ్య ఉన్నాడు. కుమారుడు రాజు గల్ఫ్‌లో ఉండగా, ఒక కూతురు ఉన్నారు. మల్లవ్వ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.


మల్లవ్వ (ఫైల్)

● కుటుంబ సభ్యుల రాస్తారోకో

మల్లవ్వ మృతదేహాన్ని తమకు తెలియకుండా పోలీసులు పోస్టుమార్టంకు పంపించారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. చందుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో కోరుట్ల-వేములవాడ ప్రధానరహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. తమకు న్యాయంచేయాలని నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. న్యాయంచేస్తామని హామీ ఇవ్వడంతో రాత్రి ధర్నాను విరమించారు.

పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు

బొల్లు మల్లవ్వను హత్య చేసింది తానేనని చందుర్తి గ్రామానికి చెందిన యువకుడు బొల్లు మనోజ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. కత్తిని పోలీసుల ఎదుట ఉంచి, మహిళ తల తీసివేసినట్టు, పెద్దమ్మ గుడి వద్ద హత్య చేసినట్టు పోలీసులకు చెప్పాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇదిలా ఉండగా మనోజ్ గతంలో ఒక వ్యక్తిని చందుర్తి గ్రామంలో వినాయక చవితి రోజున హత్య చేశాడు. ఆ సమయంలో మైనర్‌గా ఉండడంతో పోలీసులు జువైనల్ జైలుకు తరలించారు. ఆ కేసులో జైలు జీవితం గడిపి బెయిల్‌పై విడుదలై వచ్చాడు. ఈ ఘటన ఒక్కసారిగా మండలంలో కలకలం సృష్టించింది.

డిగ్రీ పరీక్షల్లో 16 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీ క్షల్లో మాల్‌ప్రాక్టీస్ చేసిన 16మంది విద్యా ర్థులను సోమవారం డీబార్ చేసినట్లు విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. కరీంనగర్ శ్రీచైతన్యడిగ్రీకళాశాల కేంద్రంలో ఇద్దరు, వాణినికేతన్‌లో ఒకరు, అపూర్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, అల్ఫోర్స్(మహిళా) డిగ్రీ కళాశాలలో ఒకరు, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శివానీ డిగ్రీకళాశాలలో ఇద్దరు, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, మహర్షి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇద్దరు, గంభీ రావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ అప్పులకు యువకుడు బలి

మానకొండూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ అప్పులకు ఓ యువకుడు బలి అయ్యాడు. సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన పప్పు ఆంజనేయులు(25) లోన్ ఆప్‌లో ఒక లక్ష అప్పు చేశాడు. వడ్డీతో పాటు రెండు లక్షల లోన్ చెల్లించాడు. అయినా మరో రెండు లక్షల రూపాయలు చెల్లించాలని యాప్ నిర్వాహకులు వేధింపులకు గురిచేసినట్లు తెలిపారు. అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఆదివారం గ్రామంలోని గుట్టవద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు చేరాల ప్రసన్నకుమార్ (27) హైదరాబాదులో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపినవివరాల ప్రకారం... తంగళ్లపల్లికి చెందిన చేరాల రాజేశం- సుగుణ దంపతుల కుమారుడు ప్రసన్న కుమార్ బీ ఫార్మసీ పూర్తిచేసుకుని హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ప్రభుత్వం ఫార్మసిస్ట్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయగా ప్రసన్నకుమార్ పరీక్ష రాశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఆందోళనకు లోనయ్యాడు. అలాగే గతంలో కూడా పలు ఉద్యోగాలకు పోటీ పరీక్షలు రాసినప్పటికీ ఎంపిక కాకపోవడంతో మానసిక వేదనకు గురయ్యాడని బంధువులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులోని కోఠిలో మరో నలుగురితో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఉదయం బాత్‌రూంలో ఉరివేసుకొని ప్రసన్నకుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన మిత్రులు ఉద్యోగాలకు ఎంపికవుతుండగా తనకు మాత్రం ఉద్యోగం రావడంలేదని ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.


ప్రసన్నకుమార్ (ఫైల్)

మొలకెత్తిన ధాన్యంతో రైతుల నిరసన

చందుర్తి మే 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మం డల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలుక పెంటయ్య అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో మొలకెత్తిన ధాన్యంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చందుర్తి రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా పెంటయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయని, వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాకులను పలుమార్లు కోరినప్పటికీ నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మార్త వెంకవ్వ, సతీష్, తిరుపతి, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మొలకెత్తిన ధాన్యంతో నిరసన తెలుపుతున్న రైతులు

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

వీణవంక, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో సోమవారం గొల్ల, కురుమలు, మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుళ్లనడుమ ఆలయానికి తరలివచ్చి స్వామివారికి మొక్కులుచెల్లించుకున్నారు. అనంతరం కామరతి, బీరప్ప కల్యాణోత్సవం కన్నుల పండువగ చేశారు.


బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

కారు బోల్తా: ముగ్గురికి స్వల్ప గాయాలు

పెద్దపల్లి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలకు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో పెద్దకల్వల శివారువద్ద మూడుకార్లు ఒక దానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలు కాగా పెద్దపల్లిఆసుపత్రికి తరలిం చారు. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం కరీంన గర్‌కు చెందిన కుటుంబ సభ్యులు కాళేశ్వరం సరస్వతి పుష్కరస్నానాలకు వెళ్లి తిరిగి వెళ్తున్న క్రమంలో పెద్దక ల్వల శివారులోని రాజీవ్‌రహదారికి ఆనుకొని ఉన్న మహబూబ గార్డెన్ ఎదుట మూడు కార్లు ఢీకొన్నాయి. కరీంనగర్ చెందినవారి కారు బోల్తాపడింది. గాయా లైనవారిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


బోల్తా పడ్డ కారు

చికిత్స పొందుతూ కాంగ్రెస్ నాయకుడు మృతి

గన్నేరువరం, మే 26 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతూ అదుపుతప్పి కిందపడగా తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మండలవర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవిందర్(51) సోమవారం మృతి చెందాడు. ఈ నెల 17న రవిందర్ బైక్‌పై వేములవాడకు బయలుదేరగా కొదురుపాక, నాంపల్లి మధ్యలో అదుపుతప్పిన బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో పక్కటెములు విరిగి తలకు తీవ్రంగా గాయాలు కాగా స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడనుంచి మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం రవిందర్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


రవిందర్(ఫైల్)

మాచారెడ్డిలో రోడ్డు ప్రమాదం

● రాజన్నపేట మహిళ దుర్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామ శివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన మహిళ చొక్కి సులోచన(28) అక్కడికక్కడే దుర్మరణం పాలైందని స్థానికులు, కుటుంబసభ్యులు సోమవారం తెలిపారు. ఆమె పిల్లలు అఖిలేష్, శివాన్స్‌లు తీవ్ర గాయాలకు గురయ్యారు. తల్లి మృతి చెందడం, ఇద్దరు పిల్లలు తీవ్రగాయాలపాలడంతో స్థానికంగా విషాదం నెలకొంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని సులోచన భర్త మహేందర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. ఉదయం ఆమె తన పిల్లలను తీసుకుని మాచారెడ్డి మండలం లచ్చపేటకు బస్సులో బయలుదేరింది. మాచారెడ్డిలో దిగిన ఆమె తన తండ్రికి ఫోన్ చేసి తీసుకెళ్లాలని పేర్కొంది. తండ్రి టీవీఎస్ ఎక్సల్‌పై చేరుకుని సులోచన, ఇద్దరు పిల్లలు అఖిలేష్, శివాన్స్‌లతో కలిసి లచ్చపేటకు వెళుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన బైక్ అతివేగంగా ఢీకొట్టింది. దాంతో సులోచన అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్ర గాయాలపాలైన పిల్లలను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తాజామాజీసర్పంచ్ శంకర్, కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పుట్టింటికి వెళుతున్నానని బయలుదేరిన మహిళ సులోచన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

భక్తులతో కిక్కిరిసిన రాజన్నక్షేత్రం

● రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు ● దర్శనానికి నాలుగు గంటల సమయం


భక్తులతో పోటెత్తిన రాజన్న ఆలయ ప్రాంగణం


ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేసవి సెలవుల సందర్భంగా రాజన్న ఆలయం భక్తులతో రద్దీగా ఉంటోంది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు శనివారం రాత్రి ఆలయా నికి చేరుకుని ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా నాలుగు గంటలు క్యూలైన్‌లో బారులుతీరారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకోగా భక్తుల రద్దీ దృష్ట్యా బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లు నిరంతరంగా కొనసాగించారు. భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని తరించారు. భీమేశ్వర, నగరేశ్వర శ్రీబద్దిపోచమ్మ ఆలయాలను సందర్శించి తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం రోజున రాజన్న ఆలయానికి 80నుంచి 90వేల వరకు భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

● భక్తుల ఇబ్బందులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల వద్ద కొందరు డబ్బులు దండుకునే యత్నం చేస్తున్నారు. బెల్లం దుకాణాల వద్ద కాంటాల్లో వ్యత్యాసం వస్తుందని భక్తులు సదరు కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. బెల్లం రాజన్న ఆలయ పేరుతో ముద్రించిన టికెట్స్ ఇస్తూ భక్తుల వద్ద అందినకాడికి దండుకుంటు న్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

అంతేకాకుండా కొబ్బరికాయ కొట్టిన చోట ఒక్కో కొబ్బరికాయకు రూ.10వసూలు చేస్తున్నారు. కొబ్బరికాయలు కొట్టే కాంట్రాక్టర్ సదరు సిబ్బందికి వేతనం ఇవ్వకుండా భక్తుల వద్ద తీసుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. దీనిపై భక్తులు ఆలయాధికారులపై తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఈవోతోపాటుగా సంబంధిత ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షించి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాల అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణనగర్‌లో ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఏడుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వారివద్ద నగదుతోపాటు ఏడుసెల్‌ఫోన్లు పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో కానిస్టేబుళ్లు కమలాకర్, అఫ్రోజ్, ఖాసీం తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

మానకొండూర్‌లో ఐదుగురు..

మానకొండూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగురుపల్లి గ్రామంలో సోమవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,460 నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీఐ గోపతి నరేందర్ తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కళ్యాణ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు రూ.25వేల పెన్షన్, 250చదరపు గజాల ఇంటి స్థలాన్ని ఇస్తానని చెప్పి ఇప్పటివరకు అమలు కాలేదని, ఉద్యమకారులకు బస్‌పాస్, గుర్తింపు కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. అనుముల కళావతి, జనగామ స్వామి, దాసరి ఎల్లయ్య, బత్తుల శంకర్, సీత, లలిత, మొగిలి, రాములు పాల్గొన్నారు.


చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు

జాతీయస్థాయి షూటింగ్ పోటీల్లో రాణించిన మేఘన

● అభినందించిన పోలీస్ కమిషనర్



మేఘనను అభినందిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పిస్టల్ షూటింగ్ పోటీల్లో రామగుండానికి చెందిన మేఘన రాణించింది. ఏసీపీ సాదుల సారం గపాణి కుమార్తె మేఘన పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించింది. సోమవారం రామ గుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆమె సన్మానించారు. పెద్దపల్లి ఏసీపీగా విధులు నిర్వహించిన సారంగపాణి ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ అకాడమీలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కుమార్తె మేఘన కొన్ని సంవత్సరాలుగా షూటింగ్‌లో రాణిస్తోంది. ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్-2023 జర్మనీలో జరుగగా బంగారుపతకం, ఆసియా చాంపియన్‌షిప్-2023లో వెండిపతకం, ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్- 2023లో దేశానికి ప్రాతినిధ్యం వహించారు. మూడు అంతర్జా తీయ చాంపియన్ షిప్ పత కాలు, బహుళ తెలంగాణ రాష్ట్ర చాంపియన్‌షిప్ పతకాలతో పాటు వ్యక్తిగత కాంస్య, ఆల్ ఇండియా పిస్టల్ షూటింగ్ పోటీల్లో రాణించారు. విలువిద్య లో సైతం జాతీయ స్థాయిలో సత్తాచాటారు. సీపీ మాట్లా డుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడల్లోఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహిం చాలని, ముఖ్యంగా నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమయ్యే పోలీసులు పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు సహకారం అందించడం సంతోషదాయకమన్నారు. మేఘన అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

ముగిసిన సరస్వతి పుష్కరాలు



సరస్వతి విగ్రహం వద్ద మంత్రి శ్రీధర్‌బాబు, తదితరులు



కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



శివుని ప్రతిమ వద్ద భక్తుల కోలాహలం



హారతిని తిలకిస్తున్న భక్తులు





హారతినిస్తున్న కాశీ పండితులు

● చివరి రోజు 2.25 లక్షల మంది పుణ్యస్నానాలు

● మొత్తంగా 15.90 లక్షల మంది భక్తుల రాక

భూపాలపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలు సోమవారంతో ముగిశాయి. భూపాల పల్లి జిల్లా కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రోజూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పుష్కరాలను విజ యవంతం చేసింది. చిన్నచిన్న అవాంతరాలు మినహా యిస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసు కోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పుష్కరాల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పా ట్లను ఘనంగా చేసింది. ఈ పుష్కరాలకు 15.9 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. చివరి మూడు రోజుల్లోనే సుమారు ఎనిమిది లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల్లో చివరి రోజైన సోమవారం 2.25 లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

● ట్రాఫిక్ సమస్యలు

పుష్కరాలకు ఆరు లక్షల నుంచి ఎనిమిది లక్షల మంది వస్తారని అంచనా వేయగా ఎవరూ ఊహిం చని రీతిలో సంఖ్య 16 లక్షలకు చేరుకోవడంతో అధి కారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భక్తుల సంఖ్య ఊహించని రీతిలో ఉండడంతో సదుపాయలకు సంబంధించి అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సరిగ్గా లేకపోవడంతో పుణ్య స్నానాల కోసం వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు.

● వైభవంగా త్రివేణిసంగమ నవరత్నమాల హారతి

కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీపుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి ఏడు నుంచి 7.45గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హరతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పుష్కరాలు విజయవంతం కావడం, 12రోజుల పాటు ప్రజలందరికీ శ్రేయస్సును, శుభాన్ని కల్గించాలని నదీమాతకు నవరత్నమాలహారతి సమర్పించడం ఆనందకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి వికాసరాజ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మదన్‌మోహన్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ పాల్గొన్నారు.





పదేళ్లలో దోచుకున్న ప్రతీ రూపాయి కక్కిస్తాం

● కాంగ్రెస్ నాయకుడు, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్లపాలనలో దోచుకున్న ప్రతీ రూపాయిని రాష్ట్రప్రభుత్వం కక్కిస్తుందని కాంగ్రెస్‌సీనియర్ నాయకుడు, కుల సంఘాల జేఏసీచైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. సోమ వారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేక రుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు అవి నీతిపై విచారణ పూర్తికావచ్చిందని, కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. ఆ భయంతోనే సీఎం రేవంత్ రెడ్డిపైనా, కాంగ్రెస్ ప్రభుత్వంపైనా మాజీమంత్రి కేటీఆర్ అడ్డగోలు వ్యాఖ్యలు చేశారన్నారు. తెలంగాణ బీఆర్ఎస్‌ది కాదని, 4కోట్ల తెలంగాణ ప్రజల దని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం రూ.70వేల కోట్ల నుంచి రూ.లక్షా50వేల కోట్లకు పెంచుకున్నారని, రూ.80వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో ఇసుకదోపిడీలో కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు భాగస్వాము లయ్యారని ఆరోపించారు. 2014కు ముందు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ఆస్తులు సాధా రణ స్థితిలో ఉంటే ఇప్పుడు వేలకోట్లకు చేరాయన్నారు. కేటీఆర్, హరీష్‌రావు విదేశాల్లో పెట్టుబడులు పెట్టారని, అవి తెలంగాణాను దోచుకున్న డబ్బులేనని అన్నారు. ఆస్తుల విషయం లోనే ఎమ్మెల్సీ కవితకు కేటీఆర్‌కు మధ్య గొడవలు తలెత్తాయన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ప్రజలను, ఉద్యమ కారులను మోసం చేశారని, చివరకు ఆడ బిడ్డ కవితను కూడా ఇంటినుంచి బయటకు గెంటేస్తున్నారని అన్నారు. తండ్రీకొడుకుల వ్యవహారంతో బీఆర్ఎస్ మూడు ముక్కలవు తుందని, హరీష్‌రావు బీజేపీలోకి వెళ్తారని అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం

విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాదబీమా

● దేశచరిత్రలోనే రికార్డు

● డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ప్రమాదబీమా చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కరీంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): విద్యుత్ కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని కరీంనగర్ సర్కిల్ చెంజర్ల సెక్షన్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ భార్య సుష్మకు సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కు, కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుడికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వమూ ఇంత గొప్పగా ఆలోచన చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాకే సాధ్యమైందని అన్నారు. ప్రమాద బీమాతోపాటు, కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు అద్దం పడుతుందన్నారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అంది ంచాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, బ్యాంకు ఉన్నతాధికారులు సర్వేశ్ రంజన్, కె.భాస్కర్ రావు, డి.అపర్ణ రెడ్డి, కరీంనగర్ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు, డీఈ తిరుపతి, ఏఈ రమేష్, లక్ష్మణమూర్తి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

● ప్రమాదకరంగా గుంతలు ● వాహనదారుల ఇబ్బందులు



వల్లంపహాడ్ బ్రిడ్జి వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు



నగునూర్ మూల మలుపు వద్ద గుంతలు పడిన రోడ్డు

కరీంనగర్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి లక్షెట్టిపేటకు వెళ్లే మార్గంలో నగర శివారులోని వల్లంపహాడ్ బ్రిడ్జి సమీ పంలో రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనాదారులు రాకపోక పోలకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు కరీంనగర్ నుంచి మంచిర్యాల, ఆసిఫాబాద్ వైపు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటితోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రహదారి వెంట కరీంనగర్‌కు వచ్చి వెళ్తుంటారు. వల్లంప హాడ్ బ్రిడ్జిపైనా, నగునూర్ నుంచి నుంచి కరీంనగర్‌కు వచ్చే రహదారి మూల మలుపు వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వర్షం కురిసి గుంతల్లో నీరు నిలవడంతో వేగంగా వచ్చే వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మూడు రోజుల కిందట ఈ గుంతల్లో నీరు నిలిచి మూడు ప్రమాదాలు సంభవించాయి. రాత్రి వేళ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వల్లంపహాడ్ బ్రిడ్జిపై గుంతలతోపాటు, మూల మలుపుల వద్ద గుంతలకు మరమ్మతు చేపట్టాలని కోరుతన్నారు.

విద్యుత్ కోసం గేదెలతో రోడ్డుపై నిరసన



రోడ్డుపైన అడ్డంగా గేదెలను కట్టేసి నిరసన తెలుపుతున్న బాధితులు

గన్నేరువరం, మే 26 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా వ్యవసాయబావికి విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో పశువులు నీళ్ల లేక అల్లాడుతున్నాయని కరీంనగర్‌జిల్లా గన్నేరువరం మండలం లోని గునుకుల కొండాపూర్‌కు చెందిన రైతు కొరివి పోచయ్య-సుశీల దంపతులు తమ గేదెలతో రోడ్డుపైన బైఠాయించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గును కుల కొండాపూర్ నుంచి గుండ్లపల్లికి వెళ్ళే ప్రధాన రహదారిపై నెల రోజులు క్రితం ఓ లారీ తగిలి విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయన్నారు. విద్యుత్ అధికారులు అక్కడికి వైర్లను తొలగించారని, అప్పటినుండి తన వ్యవసాయ బావికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. విద్యుత్ నిలిచిపోవడంతో మోటర్ నడవడం లేదని, పశువులకు నీళ్ల పెట్టడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులకు తెలిపినా నిర్లక్ష్యం పట్టించుకోలేదన్నారు. దీంతో రోడ్డుపై గేదెలతో నిరసనకు దిగినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు అక్కడికి వచ్చి రైతు దంపతులకు నచ్చజెప్పి గేదెలను తీసివే యించారు. అనంతరం వారి బావికి విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ



యమధర్మరాజుకు హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ధర్మపురి, మే 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలా డాయి. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్థానిక శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి బిల్వార్చన చేశారు. స్వామివారలకు ఆలయవేద పండి తులు బొజ్జ రమేష్‌శర్మ నిత్యపూజలు, అభిషే కాది కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీ నర సింహస్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర దేవాదాయ మాజీ కమిషనర్ పూజలు

లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మాజీకమిషనర్ సుందర్‌కుమార్ కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించారు. ఆలయం వద్ద వారికి వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారందరు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లక్ష్మీ నరసింహస్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడికి సన్మానం

ఇల్లంతకుంట, మే 26 (ఆంధ్రజ్యోతి): బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డిని రెడ్డిసంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతు తిరుపతిరెడ్డి 500మంది నిరుపేద యువతుల వివాహాలకు ఒక్కొక్కరికి రూ 10వేల విలువైన టేకు మంచాలు అందించడం గొప్ప విషయం అన్నారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు భూంపెల్లి రవీందర్‌రెడ్డి, నాయకులు చెరుకు చిన్నమల్లా రెడ్డి, వుట్కూరి కృష్ణారెడ్డి, సాంబశివరెడ్డి, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగా రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, చిన్నరాజిరెడ్డి పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు మాతృవియోగం

ఎల్లారెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణ పూర్ గ్రామానికి చెందిన ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం తల్లి బడేమాబీ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. బడేమాబీ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమె మృతి పట్ల పలువురు నాయకులు ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ఆమె భర్త కాంగ్రెస్ నాయకుడు గౌస్‌లను సోమవారం పరామర్శించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాల్ రెడ్డి, వెంకటేశ్, బుచ్చాగౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్య, ఉపాధ్యాయ సమస్యలపై రమణ విశేష కృతి

ఎల్లారెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కందుకూరి రమణ భౌతికంగా లేకున్నా ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని, విద్య, ఉపాధ్యాయ సమస్యలపై ఆయన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆత్మీయ మిత్రుల ఆధ్వర్యంలో సోమవారం రమణ సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాళోజీ సాహిత్య పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్, రిటైర్డ్ ప్రొఫెసర్ శివారెడ్డి, రచయిత కందుకూరి రమేశ్‌బాబు, రంగినేని ట్రస్టు చైర్మన్ మోహన్‌రావు, అధ్యాపకుడు శ్యాం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన పేదింటి కల



నిమ్మపల్లిలో ఇందిరమ్మ ఇల్లు ముగ్గుపోస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోనరావుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇల్లు కట్టుకోవాలని కలలుకన్న పేదింటి కల ఇందిరమ్మ ఇంటితో నెరవేరిందని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి అధికారులు, ప్రజాప్రతినిధులు ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. పల్లెల్లో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు తొందరగా నిర్మించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెంతల శ్రీనివాస్, మానుక సత్యం, నాగండ్ల భూమేష్, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ఇల్లంతకుంట, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని టీపీసీసీ పరిశీలకులు చైతన్యకృష్ణారెడ్డి, ఫక్రుద్దీన్‌లు సూచించారు. మండల కేంద్రంలోని వైశ్యభవనంలో సోమవారం అధ్యక్షుల ఎన్నికల కోసం మండలశాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా నామినేషన్లు స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు గత పాలకులు చేసిన విధ్వంసం వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదరైన కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. మారుమూల గ్రామాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేసి అట్టడుగువర్గాల ప్రజలకు మేలు చేయాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో పాటు ఉచిత గృహవిద్యుత్ ఇస్తుండటంతో ప్రజల్లో సంతోషం ఉందన్నారు. రాష్ట్రంలో తమ ఉనికి కోల్పోతామనే ఆందోళన ప్రతిపక్షాల్లో నెలకొని, తప్పుడు ప్రచారానికి తెరలేపారని విమర్శించారు. సమావేశంలో మండలశాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, చిట్టి ఆనందరెడ్డి, ప్రసాద్, తీగల పుష్పలత, ఒగ్గు రమేష్, బాలరాజు, బడుగు లింగం, రాజేశం, నరేందర్‌రెడ్డి, జమాల్, నరేష్, రాజు, కార్తీక్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచిస్తున్న ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచిస్తోందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పాటు జీపీఎఫ్ రుణం, 4 డీఏలను అందక ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతున్నారన్నారు. పీఆర్సీని ప్రకటించాలని కోరారు. ఇప్పటికైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమానాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు హన్మండ్లు, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్, కృష్ణ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ చర్యలు సరికాదు

ముస్తాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీల నాయకులు ప్రజ లకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ మెర్గు అంజాగౌడ్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాం ఎదుట ఆందోళనలు చేస్తూ ఒకరిపై ఒకరు దాడులకు దిగడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. రాజకీయ దాడులకు దిగడం తెలంగాణ సంస్కృతి కాదని అన్నారు. ఇలాంటి చర్యలు ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తాయని అన్నారు. ప్రజల్లో రాజకీయ నాయకులంటే చులకన భావం ఏర్పడుతుందన్నారు. రాజకీయ నైతిక విలువలను కాపాడాలని కోరారు. అధికారం కోసం తప్పటడుగులు వేయవద్దని హితవు పలికారు. పార్టీల బలాబలాలు చూసుకోవడం సరికాదన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా ● ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ ● కిటకిటలాడిన కలెక్టరేట్

సిరిసిల్ల కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను వెంట వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సోమవారం తమ సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శేషాద్రి పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అయితే గతంలో ప్రజలు తీసుకవచ్చిన దరఖాస్తులకు తహసీల్దార్ స్థాయి అధికారి కోడ్‌వేసి ఆన్‌లైన్ చేసుకుని ప్రజావాణిలో అందించేవారు, అయితే గత మూడు వారాలనుంచి ఆన్‌లైన్ నమోదు తొలగించారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులకు నంబర్లు వేసి ఆ నంబర్ల ప్రకారం ప్రజావాణి కార్యక్రమానికి అనుమతులు ఇచ్చారు. ఈ ప్రజావాణిలో 182 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూశాఖకు 75, హౌజింగ్ శాఖకు 36, ఎస్డీసీకి 12, డీఆర్‌డీవోకు 9, సిరిసిల్ల మున్సిపాల్టీకి 9, ఎస్పీ కార్యాలయానికి 6, జిల్లా ఉపాధికల్పన శాఖకు 5, నీటిపారుదల శాఖకు 5, జిల్లా సంక్షేమశాఖ కు 4, వ్యవసాయశాఖకు 2, జిల్లా విద్యాశాఖకు 2, టెక్స్‌టైల్ ఏడీకి 2, సబ్ రిజిస్ట్రర్‌కు 2, ఎస్ఎల్ఏకు 2 దరఖాస్తులు వచ్చాయి.

వైద్యం కోసం రూ.2లక్షల సాయం

ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన బొల్లె శ్రీనివాస్ పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నాడని అతని ఆరోగ్యానికి కావాల్సిన మందుల కోసం ఆర్థికసాయం అందించాలని అతని భార్య శంకరవ్వ సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా శ్రీనివాస్ వైద్యం కోసం రూ. 2లక్షల చెక్కును అందించారు.

సింగారంలో ప్రభుత్వ భూమిని కబ్జానుంచి కాపాడాలి

ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాలకు గురైందని అ భూమిని గ్రామాభివృద్ధికి కేటాయించాలంటూ గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో సర్వేనంబర్‌లో 365లో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని దర్శవాలీ దర్గా నిర్వాహకులు కబ్జా చేశారని ఆ భూమిని గ్రామ అవసరాలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిషన్, రామచంద్రం, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు తరలివచ్చిన పోత్గల్ ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులు



సమస్యలు వింటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమస్యలు చెప్పుకునేందుకు క్యూలైన్‌లో ఉన్న ప్రజలు

ప్యాకేజీ-9లోని కాలువ భూములను అమ్ముకుంటున్నారు

- గన్నా బాల్‌రెడ్డి, పదిర, ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో కాళేశ్వరం ప్యాకేజీ -9లో నిర్మించే కాలువలకు కేటాయించిన భూములను అమ్ముకుంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించాలి. గ్రామానికి చెందిన ముష్కం రాజయ్య, రిక్కుమల్ల లావణ్య-శ్రీనివాస్‌లకు సర్వేనంబర్ 500లలో భూములను ప్యాకేజీ -9లో కాలువ నిర్మాణాలకు తీసుకోగా గ్రామస్థులకు తెలియజేకుండా వాళ్లు ఆ భూములను అమ్ముకోవడంతో తాము కొనుగోలు చేశామని తీరా చూస్తే ఆ భూములనుంచి కాలువ వస్తుందని తెలియడం దీనిపై అమ్మిన వారిని అడిగితే పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్ స్పందించి ఆ భూములకు రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.

మరిమడ్లలో హాస్టల్‌కు భూమి తీసుకున్నారు

- లక్కె హన్మండ్లు, మరిమడ్ల, కోనరావుపేట



కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో నూతనంగా నిర్మించి హాస్టల్‌కు నా భూమి తీసుకుని భూమికి బదులు మరోచోట భూమి ఇస్తామని అధికారులు నమ్మించి ఇవ్వడం లేదు. గ్రామా శివారులో అటవీ భూమిని చదును చేసుకుని సాగుచేసుకుంటుండగా వైఎస్ ఆర్ ప్రభుత్వ హయాంలో ఆ భూమికి పట్టాలను అందించారు. దీనిపై మండల తహసీల్దార్‌తో పాటు అధికారులను కలిస్తే పట్టించుకోవడం లేదు.

ముంపు ప్యాకేజీని అందించాలి

- మంద రాధా, నీలోజిపల్లి, బోయిన్‌పల్లి



బోయిన్‌పల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో మిడ్‌మానేరు డ్యాంలో ముంపునకు గురైందని గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పట్టాలు ఇచ్చారు. గెజిట్‌లో నాపేరుతో 1758లో నంబర్‌లో ప్యాకేజీ మంజూరైనా ఇంతవరకు ఇవ్వలేదు. గ్రామంలో అద్దెకుంటున్న మాకు ఇంటి పట్టాతోపాటు ప్యాకేజీ ఇవ్వాలి.

గోశాలకు అందించిన గడ్డికి రక్షణ కల్పించాలి

- విశ్వనాథుల రమేష్, తంగళ్లపల్లి



రాజన్న కోడెలకు మేత కోసం రైతులు వితరణగా అందించిన గడ్డికి రక్షణ లేకుండా పోయింది. దీనిపై దేవస్థానం అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. రక్షణ లేక వర్షాలకు గడ్డి నీటిలో నానిపోయి కుళ్లిపోతుందని జిల్లా కలెక్టర్ స్పందించి ఆ గడ్డికి రక్షణ కల్పించాలని కోరారు.

ఎస్సీ కార్పోరేషన్ ఇచ్చిన భూముల్లోకి పోయేందుకు దారి చూపించాలి

- సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చిన లబ్ధిదారులు

ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామంలో కొనుగోలు పథకం ద్వారా ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేసి కేటాయించిన భూములల్లో సాగు చేసుకునేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని జిల్లా కలెక్టర్ స్పందించి మా భూములల్లోకి పోయేందుకు దారి చూపించాలంటూ లబ్ధిదారులు వినతిపత్రం అందించారు. భూములను అమ్మిన వ్యక్తులు దారిని మూసి వేసి దారిలేదని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందించి మాకు కేటాయించిన భూముల్లోకి పోయేందుకు దారిని చూపించాలని కొండని ఎల్లవ్వ, సర్వని నర్సవ్వ, అచ్చిగారి లక్ష్మీ, సర్వని నిర్మల, కేసుగాని నర్సవ్వ, సర్వని నర్సవ్వ తదితరులు వేడుకున్నారు.

ఓర్వలేకనే ప్రతిపక్షాల విమర్శలు

- మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి

రుద్రంగి మే 26 (ఆంధ్రజ్యోతి): రుద్రంగిలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే, ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం సరికాదని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రుద్రంగి ముద్దుబిడ్డగా సుమారు ఇప్పటివరకు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేశారని అన్నారు. ఏటీసీ కళాశాల నిర్మాణం కోసం రూ.42 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం కోసం రెండు కోట్ల మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రుద్రంగిలో అర్హులైన 243 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదలకు నీడ అందజేసిన ప్రభుత్వ విప్‌ను విమర్శించడం సిగ్గుచేటని, గత బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఏ ఒక్క పేదవాడికి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలతమనోహర్, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, కొమరె శంకర్, తర్రే లింగం, మాడిశెట్టి అభిలాష్, పిడుగు లచ్చిరెడ్డి, పుట్కపు మహిపాల్, అల్లూరి సంతోష్ రెడ్డి, గండి అశోక్, ఎర్రం రాజలింగం, సిరికొండ రవి, సూర యాదయ్య, పిడుగు లచ్చిరెడ్డి, దువ్వాక గంగాధర్, దయ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు చేసిన వారిని శిక్షించాలి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల రూరల్, మే 26 (అంధ్రజ్యోతి) : సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలతో వచ్చి దాడులు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు, పోలీసుల దాడుల్లో తీవ్రంగా గాయపడిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సబ్బని హరీష్, తంగళ్లపల్లి మండల నాయకుడు చంటిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అగయ్య మాట్లాడారు. సిరిసిల్లలో పోలీసులు కాంగ్రెస్ నాయకుల అండదండలతో రెచ్చిపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బందిపోటుల్లా దోచుకుంటున్నారని ఆరోపించారు. సిరిసిల్ల పట్టణంతో పాటు నియోజవర్గాన్ని ఏళ్ల తరబడి గుర్తుంచుకునేలా స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేటీఆర్‌పై కేకే మహేందర్‌రెడ్డి గత 20 సంవత్సరాలుగా పోటీచేస్తూ ఎప్పుడు ఒడిపోతున్నాడని అతన్ని నియోజకవర్గ ప్రజలు ఛీత్కరించినా పర్యటించడం శోచనీయన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం ఫొటోలు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. ఆదివారం సిరిసిల్లలో జరిగిన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు వెళ్లగా పోలీసులు అడుకున్నారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలంటూ క్యాంపు కార్యాలయాన్ని కాంగ్రెస్ నాయకులు ముట్టడించగా పోలీసులు పట్టించుకోలేదన్నారు. లాఠీచార్జీ చేసిన పోలీసులపై కేసులు నమోదు చేసేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, నాయకులు బొల్లి రాంమోహన్, దేవరకొండ తిరుపతి, న్యాలకొండ రాఘవరెడ్డి, గుడ్నారపు కృష్ణారెడ్డి, సిద్దం వేణు, గజభీంకార్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

తంగళ్లపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తడంతో పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్రమంగా అరెస్ట్ చేశారంటూ బీఆర్ఎస్ శ్రేణులు తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట సుమారు మూడు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. అరెస్ట్ అయిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుమారు రెండు గంటల పాటు పోలీస్‌స్టేషన్ ముందు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీస్‌స్టేషన్ భారీగా పోలీసులను మొహరించారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట పోలీసులు స్థానిక బీఆర్ఎస్ నాయకులు సోమవారం అదుపులోకి తీసుకుని ముందస్తు అరెస్ట్ చేశారు. సిరిసిల్లలోని ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయం ఎదుట బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య చోటు చేసుకున్న గొడవ నేపథ్యంలో మండలంలోని నాయకులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్వంత పూచికత్తుపై వదిలి వేశారు. నాయకులు నర్సింలు, సుధాకర్‌రావులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

క్యాంప్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య

వేములవాడ టౌన్ : సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి దిగడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి ఖండించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం లేదని కార్యకర్తలు చిత్రపటం తీసుకుని క్యాంపు కార్యాలయానికి వెళ్లడం చట్ట విరుద్ధమని క్యాంపు కార్యాలయంలో సీఎం ఫొటో విషయాన్ని సంబంధిత అధికారులు చూసుకుంటారని బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడిచేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



ఠాణాలో ఉన్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయం ఎదుట చోటు చేసుకున్న ఘర్షణ నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులను సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించిన తీరును కాంగ్రెస్ నాయకులు తప్పుబట్టారు. పోలీసులు అదుపులోకి తీసుకోవడం అన్యాయమని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు రాంరెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, బాల్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

కోనరావుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను పెంచడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమని మండల విద్యాధికారి మురళీనాయక్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌పై జరిగిన శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలు పాఠశాలలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ సబ్జెక్టుల ఆర్పీలు జంగిటి రాజు, శ్రీధర్, తిరుపతి, గోషికొండ శ్రీనివాస్, బాల కిషన్, గాలిపెల్లి సంతోష్, రేండ్ల అనిల్ బాబు, మహేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ మురళీనాయక్

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

● మరో రెండు రోజుల్లో పూర్తి చేస్తాం : డీఆర్డీవో శేషాద్రి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతుల నుంచి పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని డీఆర్డీఓ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చందుర్తిలో కొందరు వ్యక్తులు కావాలనే ధర్నా చేశారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రం పరిధిలో దాదాపు 20 మంది రైతుల ధాన్యం ఇంకా సేకరించాల్సి ఉందని తెలిపారు. మరో రెండు రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేసి రైస్ మిల్లుకు తరలించి కేంద్రాన్ని మూసివేయనున్నట్లు అక్కడి ఐకేపీ చందుర్తి మండల బాధ్యులు పీ మమత, ఎం మంజుల, ఎం వినోద తెలిపారని వివరించారు. ధాన్యం సేకరణ సజావుగా సాగుతుందని, ఎలాంటి ఇబ్బందులు లేవని డీఆర్డీఓ తెలిపారు.

కాళేశ్వరం అంశాన్ని పక్కదారి పట్టించేందుకే లేఖ నాటకం

● డీసీసీ ఉపాధ్యక్షుడు సంఘ స్వామి యాదవ్

వేములవాడ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాజేసిన కేసీఆర్ కుటుంబ సభ్యులు దోషులుగా జైలుకు వెళ్లే సమయం ఆసన్నమవుతున్న తరుణంలో దాన్ని డైవర్ట్ చేసేందుకే కవిత లేఖ నాటకానికి తెరలేపారని డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సంఘ స్వామి యాదవ్ ఆరోపించారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వాఖ్యలను ఖండిస్తూ వేమలవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన సంఘ స్వామి ఒక ప్రెస్‌నోట్‌ను సోమవారం విడుదల చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ డైరెక్షన్‌లో ఫ్యామిలీ షో నడుస్తోందని, ఎమ్మెల్సీ కవిత లేఖ ఒక పెద్ద కట్టు కథ అని, రాష్ట్ర ప్రజలతో పాటు మీడియా దృష్టిని కాళేశ్వరం ఇష్యూ నుంచి మళ్లించేందుకే కవిత లేఖ విషయం బయకు వచ్చిందన్నారు. తప్పులను కప్పి పుచ్చుకోవడం కోసం, ప్రజల్లో డ్యామేజ్ కాకుండా ఉండేందుకు లేఖ పేరుతో కొత్తనాటకానికి తెర లేపారన్నారు. వేల కోట్లు ప్రజాధనం మింగిన కేసీఆర్ అండ్ ఫ్యామిలీ రాజకీయాలకు శాశ్వతంగా రాజీనామా చేయాలని హెచ్చరించారు.

విలాసాగర్‌లో ముగిసిన సమ్మర్ కంప్యూటర్ శిక్షణ

బోయినపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు కంప్యూటర్ శిక్షణ సోమవారం ముగిసింది. ఈ శిబిరంలో విద్యార్థులు కంప్యూటర్ బేసిక్స్, మైక్రో సాఫ్ట్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్‌లు, ప్రాథమిక కోడింగ్ సాంకేతికతలపై శిక్షణ పొందారు. ఈ ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులు గ్రామాలలో ఎంతగానో ఉపయో గపడ్డాయన్నారు. కంప్యూటర్ శిక్షణపై గ్రామీణ ప్రజలు ఎంతగానో ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం మల్లేశం, ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ మహేందర్, పిడి ప్రభాకర్ కోఆర్డినేటర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు